

నేడు ధారూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ధారూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు ధారూరులో నిర్వహిస్తున్నామని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు శుభం ఫంక్షన్‌హాల్‌లో జరగనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరు కానున్నారు. ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్తీక దీపోత్సవం



కులకచర్ల : అయ్యప్ప కొండపై దీపారాధనలో మహిళలు



వీరభద్రేశ్వర ఆలయంలో ప్రమిదలను వెలిగిస్తున్న మహిళలు

ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో మహిళలు ఓం, శ్రీ, స్వస్తిక్ ఆకారాలలో ప్రమిదలను పేర్చి వెలిగించారు. కార్తీక ప్రమిదలకు హారతి నిచ్చి మొక్కుకున్నారు. కులకచర్ల మండల కేంద్రంలోని అయ్యప్ప కొండపై చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు దీపారాధన చేశారు. అదే విధంగా అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధారూరు/కులకచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

» కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఫారాన్ని నింపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా కలెక్టర్ ఎన్యూమారేటర్ సుధాకర్ రెడ్డికి పూర్తి సమాచారాన్ని ఇచ్చి, స్వయంగా ఫారాన్ని నింపారు.



ఆరు కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరు నిందితుల అరెస్ట్

మూడుచింతలపల్లి, నవంబర్ 29, (ఆంధ్రజ్యోతి) : డ్రై గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 6 కిలోల డ్రై గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన రాజుసీల్ తన స్నేహితుడైన శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే సైదులు విలాసవంతమైన జీవితానికి అలవాడు పడ్డారు. ఒడిశాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకొచ్చి ఇరువురు నగరంలో విక్రయించడానికి పథకం వేశారు. ఈక్రమంలో కీసర నుంచి తుర్కపల్లికి బైక్‌పై గంజాయిని తీసుకెళ్తున్నారు. శామీర్‌పేట్ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



లగచర్లలో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

ఫలించిన పోరాటం!

ఫార్మా భూ సేకరణ రద్దుతో సద్దుమణిగిన వివాదం

లగచర్ల భూసేకరణను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల తదితర గ్రామాల్లో ఫార్మా కారిడార్ ఏర్పాటుకు భూ అభిప్రాయ సేకరణలో అధికారులపై జరిగిన దాడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం విదితమే. ఇక్కడ భూసేకరణను గిరిజన, రైతు, ప్రజాసంఘాల నాయకులు వ్యతిరేకించారు. ప్రజా వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తాజాగా భూ సేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది.

ఫలించిన గిరిజన, రైతు, ప్రజాసంఘాల పోరాటం
వెనక్కితగ్గిన ప్రభుత్వం.. రైతుల్లో ఆనందం
రాష్ట్రంలో సంచలనం రేపిన లగచర్ల ఘటన

మా భూములు తీసుకోవడం సరికాదు



భూములను తీసుకోవడం సరైంది కాదు. భూములు కోల్పోతే ఏ ఊరో చెప్పుకోలేని పరిస్థితి. ఫార్మా కారిడార్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిసింది. కానీ తిరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములను సేకరిస్తామని ప్రకటించడం వల్ల మా భూములకు ఎక్కడ ముప్పు వస్తుందోనని భయంగా ఉంది.

\- జ్యోతి, రోటిబండ తండా

కొడంగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఫార్మా భూ సేకరణ ప్రతిపాదనను ఉప సంహరించుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, రోటిబండ తండా, పులిచర్ల తండా, పోలేపల్లి, హకీంపేట్ గ్రామాల పరిధిలో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల సేకరణ కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో అధికారులపై దాడి జరగడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం విదితమే. తమ గ్రామాల్లో ఫార్మా వద్దంటూ భూ సేకరణ ప్రక్రియను విరమించుకోవాలని మొదటి నుంచి గిరిజన, రైతు, ప్రజా సంఘాల నాయకులు వ్యతిరేకించారు. ప్రజా వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తాజాగా ఫార్మా భూ సేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించడం పట్ల రైతులు

మిగతా 6వ పేజీలో...

ఢిల్లీకి చేరిన 'లగచర్ల'..

ఫార్మా భూ సేకరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా అధికారులపై జరిగిన దాడి ఘటనలో గిరిజన రైతుల అరెస్టులు, రిమాండ్‌ల నేపథ్యంలో బాధిత కుటుంబాల ఆందోళనలు, నిరసనలు ఢిల్లీకి చేరాయి. ఢిల్లీలోని జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళ జాతీయ మానవ హక్కుల కమిషన్లకు వారు ఫిర్యాదు చేశారు. తమ వారిని పోలీసులు అక్రమంగా రాత్రి పూట అరెస్టు చేశారని, ఈ సందర్భంగా పోలీసులు తమ పట్ల అసభ్యకరంగా, అమానుషంగా, దౌర్జన్యంగా వ్యవహరించారంటూ పలువురు మహిళలు కమిషన్లకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిదులు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు లగచర్ల, రోటిబండ తండా తదితర గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు.

దీక్షాధీరుడు కేసీఆర్

» మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దీక్ష ధీరుడు కేసీఆర్ అని మాజీఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్‌పార్టీ దీక్ష దివస్‌లో భాగంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలతో కలిసి ముందుగా ఎన్టీఆర్ చౌరస్తాలోని అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లికి పూలమాల వేసి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ. కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో.. అంటూ పంతం పట్టి నవంబరు 29 ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు అంకురార్పణ చేశారని, ఈ రోజుని దీక్ష దివాస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని ఇక ముగిసిందని త్వరలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాబోతుందన్నారు. అనంతరం ఉద్యమ కారులందరికీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైల్‌రెడ్డి, సురేష్, సుభాష్; దత్తు రాజు, వేణుగోపాల్‌రెడ్డి, మధుకర్, మధు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థినులు

కులకచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల హాస్టల్ విద్యార్థినులు శుక్రవారం తహసీల్దార్ మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. వసతిగృహంలో తీవ్ర నీటి కొరత ఉందని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, భోజనం నాణ్యతగా పెట్టడం లేదని, గుడ్లు ఇవ్వడం లేదని, రాత్రి సమయంలో విషపూరిత జంతువులు వస్తున్నాయని తహసీల్దార్‌కు తెలిపారు. అక్కడి నుంచి తహసీల్దార్ డీఈవో రేణుకాదేవితో ఫోన్‌లో మాట్లాడి ఇక్కడి సమస్యలపై వివరించారు. అంతేకాకుండా కలెక్టర్‌కు ఇక్కడి సమస్యలపై నివేదిస్తున్నట్లు తెలిపారు. డీఈవో ఆగమేఘాల మీద వసతి గృహనికి చేరుకున్నారు. పని చేయని బోరు మోటార్‌ను, సరుకులు, బాత్‌రూంలు, వంట గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం, ఎంఈవో హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు.

కలుషిత ఆహారం కట్టడికి రాపిడ్ రెస్పాన్స్ టీమ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కలుషిత ఆహారానికి అడ్డుకట్ట వేసేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను నియమించినట్లు మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కమిటీ టీమ్ లీడర్‌గా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సభ్యులుగా డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, డీసీహెచ్‌ఎస్ సునీత, డీఈవో విజయకుమారి, డీసీఓ రజనీకాంత్, సామాజిక సంక్షేమాధికారి వినోద్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి మల్లీశ్వరీలు వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాపిడ్‌రెస్పాన్స్ టీమ్ సభ్యులందరు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీజేపీ చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. బీజేపీ నాయకులను శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఎక్కడికక్కడ అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొందరిని హౌస్ అరెస్టులు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు సదానందారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, నాయకులు హర్ష, రాజశేఖర్‌రెడ్డి, రవీందర్ రెడ్డిలను అరెస్టుచేసి వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మర్పల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టకుండా పోలీసులు శుక్రవారం ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న సోనూసూద్

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవాలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని సినీ నటుడు సోనూసూద్ పిలుపునిచ్చారు. శంషాబాద్ మండల పరిధిలోని పాల్మాకుల కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో సామాజికవేత్త పట్టణానికి చెందిన సిద్ధురెడ్డి సొంత నిధులతో వంట గది, మూత్ర శాలలు, తాగు నీరు కోసం నల్లాలు ప్లే గ్రౌండ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోనూసూద్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మిత్రుడు సిద్దురెడ్డిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంతో మంది ధనవంతులు ఉన్నా పేదలకు సహాయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమాజనికి తమ వంతు సహాయం చేస్తే ప్రభుత్వ పాఠశాలలు మెరుగు పడుతాయన్నారు. సిద్ధు రెడ్డి మాట్లాడుతూ తన సంపదలో కొంత సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో సోనూసూద్ సెల్ఫీలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పోలీస్ యూనిఫాం, గన్, సెల్‌ఫోన్లు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

హనీట్రాప్ నిందితుల అరెస్ట్

- ప్లాట్లు ఉన్నాయంటూ పిలిచి రియల్టర్ కిడ్నాప్
- రూ.3 కోట్లు డిమాండ్.. రూ.20లక్షలకు ఒప్పందం
- కేసును ఛేదించిన పోలీసులు.. ఐదుగురి రిమాండ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో హనీ ట్రాప్ ద్వారా ఓ వ్యాపారవేత్తకు వలవేసి కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన ఐదుగురు నిందితులను ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 21న జరిగిన ఈ ఘటన వివరాలు ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి వెల్లడించారు. మండలంలోని చెర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన కొరివి ధన్‌రాజ్ (42) ఎంబీబీఎస్ చదువును మధ్యలో వదిలేశాడు. అనంతరం రియల్ ఎస్టేట్ రంగంలో రాణించాలని తన తల్లి పేరుతో ఉన్న ఆరెకరాల భూమిని సోదరులకు తెలియకుండా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అక్కడి నుంచి తన మకాంను వనస్థలిపురం పరిధి వైదేహీనగర్‌కు మార్చాడు. తనకున్న భూమిలోంచి రెండెకరాలు విక్రయించి రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలెట్టాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సులువుగా డబ్బు సంపాదించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నంకు చెందిన వస్త్ర వ్యాపారి, రియల్టర్ రచ్చ నారాయణను టార్గెట్ చేశాడు.

ఐదుగురితో కలిసి కిడ్నాప్

అనుకున్నట్లుగానే ముందుగా ఎస్సై యూనిఫాం, షూస్, డమ్మీ పిస్టల్, ఓ కత్తిని కొనుగోలు చేశాడు. తనకు పరిచయమున్న సికింద్రాబాద్ మౌలాలికి చెందిన బ్యూటీషియన్ మక్కల భవాని(27)తో ఫోన్ చేయించి తమ వద్ద ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయని ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగులూరు దగ్గర మెట్రో సిటీకి రావాల్సిందిగా కోరగా ఈ నెల 21న నారాయణ అతని డ్రైవర్ ముజీబ్‌ఖాన్‌తో కలిసి కారులో వెళ్లారు. అక్కడ తన మేనల్లుడైన శివకుమార్ (26), అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌కు చెందిన సుర్వి శేఖర్ (33), ఇబ్రహీంపట్నం మండలం కర్నంగూడకు చెందిన దేరంగుల శ్రీకాంత్ (26)లతో కలిసి కారులో నారాయణతోపాటు డ్రైవర్ ముజీబ్‌ఖాన్‌ను కిడ్నాప్ చేశారు. వారి ముఖాలకు నల్లటి ముసుగులు వేసి 45 నిమిషాలసేపు కారులో తిప్పి ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న ఓ వెంచర్లో ఉన్న గదికి తీసుకెళ్లారు. అక్కడ ఎస్సై డ్రెస్‌లో ఉన్న ధన్‌రాజ్ నారాయణకు తుపాకి పెట్టి బెదిరించాడు.

బాండ్‌పేపర్‌పై సంతకాలు

ఆ అమ్మాయిలతో నీకు అక్రమ సంబంధం ఉన్నట్లు ఫొటోలు, వీడియోలు తమ దగ్గర ఉన్నాయని, రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర అంత డబ్బు లేదని చెప్పగా చివరగా బేరమాడి రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. రెండు రోజుల్లో డబ్బు సర్దుబాటుచేసే విధంగా ఓ బాండ్ పేపరుతోపాటు రెండు తెల్లటి పేపర్లపై నారాయణ సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నారు. ఆ తర్వాత మేం నిజమైన పోలీసులం కాదని పోలీసులకు చెబితే చంపుతామంటూ బెదిరించారు. ఆ తర్వాత కారులో కొంతదూరం తీసుకెళ్లి నారాయణతోపాటు డ్రైవర్‌ను వదిలేశారు. ఇదే విషయమై నారాయణ ఈ నెల 23న ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షణలో ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకొని, కిడ్నాప్‌కు ఉపయోగించిన కంట్రీ గన్, ఓ కత్తి, పోలీస్ యూనిఫాం, ఏడు సెల్‌ఫోన్లు, కారుతోపాటు బాండ్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరిత గతిన ఛేదించిన సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సైలు రాజు, వెంకటేష్ వారి సిబ్బందిని డీసీపీ సునీతారెడ్డి అభినందించారు.

పాఠశాలల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి

కులకచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీలు చేసినంత పనులకు బిల్లులు చెల్లించామని అధికారులు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టగా, చేసిన పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందలేదని పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు చేసిన పనులు, రికార్డులనఉ డీఆర్‌డీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ ఉమేశ్‌కుమార్ పరిశీలించారు. చేసిన పనులకు సంబంధిత అధికారులు రికార్డు చేసి బిల్లులు చెల్లించాలని తెలిపారు. పనులకు ఎక్కువ ఖర్చు చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, ఏపీవో చంద్రశేఖర్, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


పోలీసుల పనితీరు భేష్

మోమిన్‌పేట్ పీఎస్‌ను పరిశీలించిన ఎస్పీ నారాయణరెడ్డి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

మోమిన్‌పేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో గత మూడు సంవత్సరాల్లో నమోదైన వివిధ కేసులు, రికార్డులను పరిశీలించారు. ఈ సంవత్సరం నేరాల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. పోలీసుల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలు, తదితర సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిసెంబర్‌లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నందున దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని సీఐ నవీన్‌కుమార్‌కు సూచించారు. సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గన్‌లైసెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి గన్‌లైసెన్స్ హోల్డర్‌లను చెక్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అవి డిపాజిట్ చేసేలా చూడాలన్నారు. పెట్రోల్ బంకు లైసెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి అన్నీ పెట్రోల్ బంకు యజమానులతో మాట్లాడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అరవింద్, అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.







14న జాతీయ మెగా లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కోర్టులో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో పోలీసులు సహకరించాలని కోరారు. చిన్న చిన్న తగదాలు, మోటారు వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఇతర కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు చంద్రకిషోర్, శీతల్, శ్రీకాంత్, శృతిదూత, పీపీ సమీనా బేగం, డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సీఐలు బీమ్ కుమార్, రఘురామ్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ కుమార్, పోలీసు లు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

లంబాడీల పోరాటంతోనే ఫార్మా కారిడార్ భూసేకరణ రద్దు


రాంబల్‌నాయక్‌తో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై లంబాడీలు చేసిన పోరాట ఫలితంగానే ఫార్మాసిటీ భూసేకరణ రద్దు చేశారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ తెలిపారు. భూసేకరణను విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయగానే శుక్రవారం షాద్‌నగర్ లంబాడి హక్కుల పోరాట సమీతి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలకు దారదత్తం చేయడానికి లంబాడీల భూములను లాక్కుంటామంటే ఊరుకుంటామా అని ప్రశ్నించారు. లంబాడీల భూములను లాక్కోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టినా లంబాడీల పోరాటం మాత్రం ఆగలేదన్నారు. భూసేకరణను రుద్ద చేసిన ప్రభుత్వం లంబాడీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్‌ఎచ్‌పీఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, చందునాయక్, మోహన్‌నాయక్, బాబురాజ్‌నాయక్, రవినాయక్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.





ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కడ్తాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముద్విన్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వారు సందర్శించారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో ప్రభుత్వం డబ్బు రైతుల ఖాతాల్లో వేస్తుందన్నారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, స్థానిక నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

సాగు విధానంపై రైతులకు అవగాహన

పలుగుట్టలో హార్టికల్చర్ విద్యార్థుల పర్యటన



పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు సాగువిధానంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత క్షేతస్థాయిలో పంటల సాగులో భాగంగా వారు పలుగుట్ట గ్రామాన్ని సందర్శించామన్నారు. ఇందులో భాగంగానే గ్రామ పటం, నేల రకాలు, పంటల సాగు శాతం, రకాల శాతం, పూలసాగు విస్తీర్ణం, పంట మొబిలిటీ మ్యాప్ తదితర వాటిని విద్యార్థులు ప్రదర్శించి, గ్రామంలోని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, రైతులు తదితరులు ఉన్నారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి

లేకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తాం : జేఏసీ



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పంచాయతీ ఎన్నికలకు బహిష్కరిస్తామని జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్ హెచ్చరించారు. తొమ్మిది పంచాయతీలను కలిపి వెంటనే గట్టిప్పలపల్లి ని మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 28వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు ఎంతటి పోరాటానికైన వెనకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, రంగారెడ్డి, లక్ష్యనాయక్, వెంకట్ రావు, జంగయ్య, హుస్సెన్, రామచంద్రి, లింగయ్య, చెన్నయ్య, దాసు, తానేశ్, రామస్వామి, మోహన్ రెడ్డి, వినోద్‌బాబు, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన తప్పనిసరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆమనగల్లు , నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రజలు భాగమవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ అధికారి డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర పిలుపునిచ్చారు. ఈ వ్యాధి ప్రమాదకరమైనది కాదని, ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించేది కాదని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర ప్రారంభించారు. సర్వే, కుష్ఠువ్యాధి అనుమానితులను గుర్తించే విధానంపై శిక్షణ ఇచ్చారు. డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు ఆమనగల్లు మండలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మంజులా దేవి, షైమూన, ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, యూనియన్ నాయకుడు కర్నాటి సాయిరెడ్డి, వైద్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

35,640 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తి

తాండూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 35,640 క్వింటాళ్ల 40 కిలోల ధాన్యం కొనుగో లు చేసినట్లు తాండూ రు డీసీఎంఎస్ ఇన్‌చార్జి ఎల్లప్ప తెలిపారు. ఆయన శుక్రవారం బెల్కటూర్ కొనుగోలు కేంద్రాని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా సన్న వడ్లు కొనుగోలు చేసేందుకు బెల్కటూర్, యాలాల మండల పరిధిలో యాలాల, బషీరాబాద్ మండల పరిధిలో కాశీంపూర్, పెద్దేముల్ మండల పరిధిలో మంబాపూర్‌లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు అన్ని కేంద్రాల ద్వారా 726 మంది రైతుల వద్ద నుంచి 98,101 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కాగా, 499 మంది రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. సన్నరకాల వడ్లను కొనుగోలు చేసే కొనుగోలు కేంద్రం వద్ద ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. శుభ్రం చేసిన వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320లతోపాటు రూ.500లు బోనస్ అందిస్తున్నామని, దొడ్డురకం ధాన్యానికి రూ.2,320లు లెక్కన రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ ప్రతినిధి భాస్కర్, రైతులు ఉన్నారు.

అధిక తాగునీటి చార్జీల వసూలుపై నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా తాగు నీటిపై అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయడంపై ఆదిబట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పంచాయితీగా ఉండగా తాగునీరు ఉచితంగా వచ్చేదని మున్సిపాలిటీ ఏర్పాటు తరువాత వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తరువాత కనీసం ఒ క్క పైపులైన్ కూడా కొత్తగా ఏర్పాటు చేయకుండా వేలల్లో బిల్లు చెల్లించమనడం ఏమిటని అధికారులను నిలదీశారు. అనంతరం ఆదిభట్ల మున్సిపాలిటీ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె సాయిబాబ గౌడ్, టింగ్లీకర్ రాజు, భూపతిగళ్ల అశోక్, ప్రభాకర్, జంగయ్య, కోరే శివ కుమార్, కృష్ణ, జై శంకర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి దాయర చెరువుపై 'హైడ్రా'కు ఫిర్యాదు

కీసర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కీసర మండలం, రాంపల్లి దాయర చెరువు పరిధిలో జరిగిన ఆక్రమణలపై శుక్రవారం కందాడి అంజిరెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. రాంపల్లి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 457/1/అలో 2 ఎకరాల 17 గుంటల చెరువును ఆక్రమించి మట్టితో నింపి ప్రీ కాస్ట్ వాల్ నిర్మించారని తెలిపారు. ఆక్రమణలపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.



మున్సిపల్ కార్యాలయం

పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్యం

- తొమ్మిది రోజుల పాటు నిర్వహణకు ప్రణాళిక
- రేపటి నుంచి ప్రారంభం
- కార్మికులకు కిట్లు, ఆరోగ్య శిబిరాలు
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

తాండూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. స్వచ్ఛ పట్టణంగా మార్పు తేవాలనే ఉద్దేశంతో తొమ్మిది రోజుల పాటు పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు పకడ్బందీగా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబర్ 1 (రేపటి) నుంచి వార్డుల వారీగా ఈ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు మున్సిపాలిటీలో మున్సిపల్ శాఖ వార్డుల వారీగా అధికారులను నియమించారు. అలాగే ఇందుకు అవసరమైన సామగ్రిని ముందుగానే సమకూర్చాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 1నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

డిసెంబర్ 3వ తేదీన అర్బన్‌డే

ఈ ప్రత్యేక కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయుటలో భాగంగా మున్సిపల్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 3న అర్బన్ డే పురస్కరించుకొని మున్సిపల్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అభివృద్ధి పనులు, ఇందిరా మహిళ శక్తి యూనిట్లకు చేపట్టనున్నారు. అలాగే ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలను చేపడుతారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి కింద ఇందిరా మహిళ శక్తి, స్ట్రీట్ వెండర్లకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఇందిరా మహిళ శక్తి స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అలాగే స్థానికంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి స్థానికంగా ఉన్న కళాకారులను గుర్తిసారు. పారిశుధ్యం, పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని చేపడుతారు. వాటర్ బాడీలు, దేవాలయాలు, ఉద్యాన వనాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, మతపరమైన ప్రదేశాలు , పర్యాటక కేంద్రాలు, పార్కులు వంటి జనసమూహ ప్రదేశాలను ఒక్కొక్క రోజు ఒక్కో ప్రదేశం వద్ద శుభ్రం చేసేందుకు ప్రణాళికలు చేస్తారు. ఇందులో ప్రధానంగా శుభ్ర పరిచే కార్యక్రమాలు చేపడుతారు. డిసెంబర్ 3న పబ్లిక్ టాయిలెట్లు, పాఠశాలలో స్పెషల్ శానిటైషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ..

మున్సిపల్ కార్మికులకు ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తారు. పీపీఈ కిట్లను ఈ ప్రోగ్రాంలో అందజేస్తారు. ప్రత్యేకంగా కార్మికులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తారు. ప్రజా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ఈ కార్యక్రమంలో ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపడుతారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు మున్సిపల్ శాఖ అధికారులు విద్యుత్, పోలీస్, హెల్త్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వంటి విభాగాలతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఈ నెల 30 లోపల కార్యచరణను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

క్లస్టర్ల వారీగా సూపర్‌వైజర్ల నియామకం

కార్యకలపాలు చేపట్టేందుకు వార్డుల వారీగా నోడల్ అధికారులను నియమించడం, పర్యవేక్షించేందుకు క్లస్టర్ల వారీగా సూపర్ వైజర్లను నియమిస్తూ కేటాయించిన వార్డులను పర్యవేక్షించడం, రిపోర్టింగ్ చేయనున్నారు. వార్డులలో చెత్త వర్నరబుల్ పాయింట్లను గుర్తించడం, మురుగు కాల్వల పరిస్థితి, ప్రధాన రహదారులు, వీధులను గుర్తిస్తారు. ప్రతీరోజు వార్డులలో పారిశుధ్యంతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపడుతారు. వాణిజ్య ప్రాంతాలలోని చెత్త డబ్బాలను శుభ్రం చేయిస్తారు. రోడ్డు మార్జిన్‌లపై వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసేందుకు ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేస్తారు.

కాంగ్రెస్‌లో చల్లారని ఫ్లెక్సీ చిచ్చు

- చింపిన వారిని వదలమంటున్న నేతలు
- గుప్పుమంటున్న గ్రూపు రాజకీయాలు
- సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధిష్ఠానం

మేడ్చల్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చింపిన వ్యవహారం కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చు పెట్టింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న నేతలు ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించే పనిలో పడ్డారు. మరి కొందరు వీలుంటే పోలీసుల సాయం తీసుకుని వారిపై చర్యలు తీసుకోవటానికి సిద్ధమవుతున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం, గ్రంథాలయం చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఇద్దరు మంత్రులు, ఇతర బడా నేతలు విచ్చేస్తున్నదున వారి స్వాగతం కోసం స్థానిక కాంగ్రెస్ నేతలు మేడ్చల్ జాతీయ రహదారి పరిసరాల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు. కాగా, వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చింపిన విషయం విదితమే. ఈ చర్యకు సొంత పార్టీ వారే పాల్పడ్డారంటూ ఒక వర్గం నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. కాగా, కార్యక్రమానికి మంత్రులు, ప్రముఖులు హాజరు కాలేదు. దీంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన నేతలకు ఫ్లెక్సీలు, కటౌట్‌లు చించడం మరింత మనస్తాపానికి గురిచేసింది. దీంతో ఈ వ్యహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకు పోవడానికి ఆ వర్గం నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు



ఇటీవల మేడ్చల్ రింగ్ రోడ్డు సమీపంలో చింపిన ఫ్లెక్సీ..

వదలమంటున్న ఒక వర్గం నేతలు

ఫ్లెక్సీల వ్యవహారంతో గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయట పడ్డాయి. ఈ విషయమై అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఫ్లెక్సీల ఏర్పాటులో ప్రొటోకాల్ పాటించ లేదంటూ స్వయాన జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి బహిరంగంగా ఆరోపణ చేయటంతో పాటు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నేతల మధ్య సమన్వయం, సఖ్యత లేని కారణంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని కొందరు నేతలు అవేదన వ్యక్తు చేస్తున్నారు. పార్టీలో గ్రూపు రాజకీయలను ప్రొత్సహిస్తున్న నేతల కారణంగా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. కుల రాజకీయాలతో కొందరు చిచ్చు పెడుతుండగా ఆధిపత్యం కోసం మరి కొందరు పార్టీలో గ్రూపు రాజకీయాలను ప్రోత్స హిస్తున్నారంటూ కొందరు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కాగా ఇక్కడ వార్డు నేతకూడా సీఎం రేవంత్ రెడ్డి పేరు చెప్పుకుని పెత్తనం చెలాయిస్తున్నందున ఈ పరిస్థితి దాపురించిందని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా వంగేటి



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న టీచర్స్

కీసర నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా టీచర్స్ కో-ఆపరేటివ్ డైరెక్టర్‌గా వంగేటి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ కో-ఆపరేటివ్ నిబంధనల ప్రకారం శుక్రవారం జరిగిన సొసైటీ ఎన్నికల్లో కీసర మండలం, యాద్గార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వంగేటి వెంకట్‌రెడ్డి డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డిని సన్మానించి అభినందించారు.

దామగుండం అగ్నిప్రమాదంపై ఆరా

డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, పరిగి సీఐ పరిశీలన

పూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై అధికారులు విచారణ జరిపారు. శుక్రవారం డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదనరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణ, ఎఫ్ఆర్‌వో శ్యామ్, నేవీ అధికారి జీఎం.రావులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపుగా 20ఎకరాల్లో అటవీ ప్రాంతంలో గడ్డికి నిప్పంటుకుని కాలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో పెద్ద చెట్లకు ఎలాంటి నష్టం జరగలేదని వారు తెలిపారు. మంటలు అంటుకోవడంపై ఆకతాయిలే కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మంటలు అంటుకునేందుకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. అనంతరం అక్కడున్న స్వామిజీ ఆశ్రమాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలో ఆశ్రమం ఎంత స్థలంలో కొనసాగుతుందనే దానిపై విచారించారు. అయితే ఈ భూమి అటవీ ప్రాంతంలోకి వస్తే భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని అధికారులు ఆశ్రమంలో ఉండే స్వామిజీకి తెలిపారు.



మంటలు అంటుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గడ్డి భూముల్లో మంటలు ఏర్పడే అవకాశం

దామగుండం అడవిలో గురువారం రాత్రి గడ్డి భూమికి నిప్పంటుకుందని డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే 9.30గంటల సమయంలో ఫారెస్ట్, రెవెన్యూ, ఫైర్, నేవీ సిబ్బంది దామగుండం చేరుకోగా, అప్పటికే మంటలు ఆర్పివేసిన ప్రాంతాలు కనిపించాయని తెలిపారు. సహజంగానే గడ్డి భూములు దామగుండంలో ఎక్కువగా ఉండటం వల్ల ప్రతీ ఏడాది ఏదో ఒక చోట మంటలు ఏర్పడుతుంటాయని డీఎఫ్‌వో పేర్కొన్నారు. అది కూడా మానవ తప్పిదాల వల్లనే ఈ మంటలు రాజుకుంటాయన్నారు. డిసెంబర్ నుంచి మే వరకు గడ్డి భూముల్లో మంటలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఫారెస్ట్, నేవీ సిబ్బంది అడవిలో గస్తీ తిరుగుతూ మంటలు ఏర్పడిన వాటిని గుర్తించి ఆర్పే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు చోటు చేసుకోకుండా పూర్తి చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీడీఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి పురపాలక పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్ టీ కే శ్రీదేవి ప్రజా పాలన విజయోత్సవాలపై అదనపు కలెక్టర్లు, మెప్మా పీడీలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడారు. విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 3వ తేదీన జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహించాలన్నారు. మునిసిపాలిటీ పరిధిల్లో సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ దీపాలతో ప్రధాన కూడళ్ల కార్యాలయాలను అలంకరించాలని ఆయన తెలిపారు. మహిళా సంఘాల గ్రూపులకు రుణాల చెక్కులను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, విక్రమ్ సింహారెడ్డి, వెంకటయ్య, బలరాంనాయక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్లు వెంకటేశ్, రాజేంద్రప్రసాద్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఆర్వో సంక్షేమ సంఘం నేత ఉపేంద్రరావు

డిసెంబర్ 1న వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం

శామిర్‌పేట, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 1న రాష్ట్ర స్థాయిలో వీఆర్వోలు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారులు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంటలో వీఆర్వోల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొఘుల్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు, అత్యధిక సంఖ్యలో తప్పనిసరిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో ఎమ్మెస్ నంబర్ 29 ద్వారా వీఆర్వో వ్యవస్థను రద్దు చేయబడిందన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 121 ద్వారా వీఆర్వోలను అర్ధరాత్రి వేళ లాటరీ పద్ధతి ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలకు విరుద్ధంగా ఇతర శాఖల్లోకి, అటానమస్ బాడీల్లోకి బలవంతంగా సర్దుబాటు చేసినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనంలో వివిధ అంశాలపై, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నటు వివరించారు. సమ్మేళనానికి రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మోహన్, జిల్లా అధ్యక్షుడు దేశ్‌పాండే, నాయకులు మాణిక్యం, సత్యం, కిశోర్‌కుమార్, మన్నె గణేష్, లక్ష్మణ్‌రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ, హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో కూడా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగాయన్నారు. మూడు రోజులుగా మళ్లీ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులనే టార్గెట్ చేసుకుని దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసను ఆపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రేపటి నుంచి బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి డిసెంబర్ 1(రేపటి) నుంచి బైక్ ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య తెలిపారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఏటీ కాంప్లెక్స్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువురు నాయకులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటి వరకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరిస్తూ, వారిలో చైతన్యం తీసుకురావడానికి ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ర్యాలీ షాద్‌నగర్ నియోజక వర్గంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, కె. మనోహర్‌రెడ్డి, అమడాపురం నర్సింహ గౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, ప్యాట అశోక్, వెంకనోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

లగచర్ల భూసేకరణ రద్దు రాజ్యాంగ విజయం

పరిగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లగచర్ల భూసేకరణను నిలిపివేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం రాజ్యాంగం, లంబాడ రైతుల విజయమని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్ అన్నారు. పరిగిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, నాయకులు హరినాయక్, బాబ్యా, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ఫార్మా భూసేకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంపై ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

బొంరాస్‌పేట్: లగచర్లలో ఫార్మా భూసేకరణను ప్రభుత్వం రద్దు చేయడంపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, బుస్స చంద్రయ్య శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కొడంగల్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. మండలంలోని అంగడిరైచూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దోమ: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఎంపీడీవో మహేశ్‌బాబు శుక్రవారం సందర్శించారు. బియ్యం, కూరగాయలు, వంట గది, తాగునీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, ఎంఈవో వెంకట్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ఎన్కతల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ప్రభ తనిఖీ చేశారు. స్టోర్ రూంలో బియ్యం, వంట సరుకులు ఇతరాత్ర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఆర్ఐ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, పద్మారావు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని నవాంద్గీ పాఠశాలను ఎంపీడీవో విజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలును స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు.

వంట పాత్రలు అందజేత

మేడ్చల్ టౌన్: గిర్మాపూర్‌లో మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు వంటలు వండి పెట్టే కార్మికులకు దాత రూప్సీరాణి శుక్రవారం వంట పాత్రలను అందజేశారు.

ఇన్నోక్వేస్ట్ హ్యాకథాన్ ప్రారంభం



ఇన్నోక్వేస్ట్ హ్యాకథాన్‌లో పాల్గొన్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్ సహకారంతో శుక్రవారం ఇన్నోక్వేస్ట్ హ్యాకథాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయకుమార్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. హ్యాకథాన్‌లో పాల్గొని విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్లు ముత్తారెడ్డి, విష్ణుమూర్తి, ఎం.శ్రీనివాస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గొంతు నొక్కేస్తున్నారు'



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం సమావేశంలో తనను మాట్లాడకుండా గొంతు నొక్కేస్తున్నారని డైరెక్టర్ సీహెచ్ ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను చైర్మన్ ఎస్ రాంరెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. చైర్మన్‌తో తనకు ప్రాణభయం ఉన్నదన్నారు. ఈవిషయమై చైర్మన్ ఎస్ రాంరెడ్డిని వివరణ కోరగా ఘట్‌కేసర్ సొసైటీలో అవినీతి అక్రమాలకు తావులేకుండా పని చేస్తున్నామన్నారు. తనహయంలో ఒక్క ఉద్యోగినీ నియమించలేదన్నారు. డిఫెన్స్ అకాడమీ విషయంలో పాత నిబంధనలే అమలవుతుందన్నారు. అసలు ఆయనతోనే తనకు ప్రాణభయం ఉన్నదన్నారు.

కార్తీకమాస ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

పరిగి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పరిగి డిపోలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం వనభోజనాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అదేవిధంగా ఉద్యోగులతో సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ, అసిస్టెంట్ డీఎం సోమ్లా పాల్గొన్నారు.

స్పీకర్ సహకారంతో అభివృద్ధి

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ సహకారంతో వికారాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. పట్టణంలోని 5, 7, 26, 33 వ వార్డుల్లో శుక్రవారం యుజీడీ పైప్‌లైన్ పనులకు మ్యాన్ హోల్ రిపేరింగ్ పనులకు మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అర్ద సుధాకర్‌రెడ్డితో కలిసి కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌కుమార్, సునీత రమేష్‌గౌడ్, సంతోష నర్సింహులు, రమేష్ గౌడ్, సురేష్, మల్లికార్జున్, శ్రీనివాస్ ముదిరాజ్, బందయ్య, అనిల్ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలేవి?

- నిబంధనలు అతిక్రమిస్తున్న లారీలు
- దెబ్బతింటున్న ఆర్అండ్‌బీ రోడ్లు
- పట్టించుకోని అధికారులు



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనం



ధ్వంసమైన కరన్‌కోట్ రోడ్డు(ఫైల్)

తాండూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు నియంత్రణ కరువైంది. విరుద్ధంగా భారీ వాహనాలు సరుకులను సరఫరా చేస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. నిధులు లేక నీరసించిన ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. సిమెంట్ కర్మాగారాలకు తాండూరులో 500ల వరకు నిత్యం లారీలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా లారీలు,టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా వందలాది ఎకరాల్లో నాపరాయి పరిశ్రమలు, సుద్ద గనులు, సీసీఐ, ఇండియా సిమెంట్ కర్మాగారాలు విస్తరించి ఉన్నాయి.

టన్నుల కొద్దీ ఖనిజం..

7వ నెంబర్ జాతీయ రహదారిపై సామర్థ్యాన్ని మించి లారీల్లో ఎర్రమట్టి, సిమెంట్ బస్తాలు, నాపరాతి బండలు, సిమెంటు ట్యాంకర్లు, సుద్దను తాండూరు రోడ్ల గుండా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ప్రతి లారీలో15టన్నుల నుంచి 20 టన్నుల వరకు ఖనిజాన్ని రవాణా చేయాల్సి ఉండగా 40టన్నులను తరలిస్తున్నారు. దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా రవాణా

తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులో విస్తరించిన నాపరాయి గనుల నుంచి, కరణ్‌కోట్ గ్రామంలో నిర్మించిన సీసీఐ సిమెంట్ కర్మాగారం నుండి ఇదే మండలంలో మల్కాపూర్ గ్రామ శివారులోని ఇండియా సిమెంట్ కర్మాగారం, మల్కాపూర్, కోటబాస్పల్లి శివారులో నిక్షిప్తమైన నాపరాయి రాళ్ల, పాలిషింగ్ బండలు తాండూరు మీదుగా హైదరాబాద్, ముంబై, కర్నూల్, కడప వంటి సుదూర ప్రాంతాలకు నాపరాయిని తరలిస్తుంటారు. సుదూర ప్రాంతాలకు వెళ్తుండటంతో అధిక లోడ్‌ను నింపి పంపుతున్నారు. మరోపక్క పాషాపూర్, ఆడ్కిచర్ల, తట్టేపల్లి, తదితర ప్రాంతాల నుంచి ఎర్రమట్టిని అధిక లోడ్‌తో సిమెంటు కర్మాగారాలకు రవాణా అవుతున్నాయి. రెగ్యులర్ వాహనాలు కావడంతో చెక్‌పోస్టులకు, తనిఖీ అధికారులకు తక్కువ బరువు ఉన్న రశీదులను చూయించి నిబంధనలకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై కరన్‌కోట్ గ్రామస్తులు ఓవర్ లోడ్‌తో వెళుతున్న లారీలను నియంత్రించాలని గతంలో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



శామీర్‌పేట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న తెలంగాణ మాథ్స్ ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజు

శామీర్‌పేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం క్రమ శిక్షణతో చదవాలని జిల్లా తెలంగాణ మాథ్స్‌ఫోరం అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. తూంకుంటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ మాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల విద్యార్థులకు మండల స్థాయిలో గణితం టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో విజేతలైన విద్యార్థులకు తెలంగాణ మాథ్స్ ఫోరం అధ్యక్షుడు రాజు, శామీర్‌పేట మండల మాథ్స్ ఫోరం అధ్యక్షురాలు రజిని, గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు శ్రవంతి బహుమతులను అందజేశారు.

పెద్దేముల్: మండలంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం మండలస్థాయిలో మ్యాథ్స్ టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. తెలుగుమీడియం నుంచి ముగ్గురు, ఇంగ్లీష్ మీడియం నుండి ముగ్గురు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఎంపికచేశారు. మండలస్థాయిలో ప్రతిభకనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు మండల విద్యాధికారి నర్సింగ్‌రావు బహుమతులు అందజేశారు.

కులకచర్ల: గణిత దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పుట్టపహాడ్ పాఠశాల విద్యార్థికి మొదటి, సాల్విడ్ పాఠశాల విద్యార్థికి ద్వితీయ బహుమతి లభించింది. గణిత ప్రాముఖ్యతను హెచ్ఎం అంజిలయ్య వివరించారు.

బొంరాస్‌పేట్: మండల స్థాయిలో జరిగిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు ఎంఈవో హరిలాల్ అభినందించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మ్యాథ్స్ ఫోరం కన్వీనర్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బషీరాబాద్: పదోతరగతి విద్యార్థులకు బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో శుక్రవారం మాథ్స్‌పై టాలెంట్ టెస్టు నిర్వహించారు. 11 జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున 43మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను కనబర్చారు. విద్యార్థులకు తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాథ్స్ ఫోరం కో-ఆర్డినేటర్లు రవికాంత్, నాగరాజు, వీరేశం, వెంకట్‌రాంరెడ్డి, రవిసుగంధి, శేర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఫలించిన పోరాటం!

(3వ పేజీ తరువాయి)

ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా భూసేకరణను ఉప రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం రైతులకు ఉపశమనం కలిగించింది. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత భూ సేకరణను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సంచలనం రేపిన లగచర్ల ఘటన

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా భూ అభిప్రాయ సేకరణలో అధికారులపై జరిగిన దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. భూ అభిప్రాయ సేకరణలో భాగంగా లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండా, హకీంపేట్, పోలెపల్లి గ్రామాల పరిధిలో 1314.21ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు ప్రకటన వెలువడినప్పటి నుంచి రైతులు, గిరిజనుల నుంచి భూ సేకరణను వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 11న భూసేకరణపై ప్రజాభిప్రాయం సేకరించేందుకు లగచర్లకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఇతర అధికారులపై స్థానిక రైతులు, ఇతర గ్రామాల ప్రజలు దాడికి పాల్పడడమే కాకుండా వారి వాహనాలను ధ్వంసం చేసిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. కాగా, ఈదాడిలో కడా అధికారి వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, ఇంకా ఆయన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. లగచర్ల ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు 71మందిపై కేసులు నమోదు చేయగా, వారిలో 29 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మిగతావారు పరారీలో ఉన్నారు. రిమాండ్‌కు తరలించిన వారిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఆయన ప్రధాన అనుచరుడు బోగమోని సురేశ్ కూడా ఉన్నారు.


రైతులు ఆసక్తిగా లేరు..

వామపక్ష నాయకులు, ప్రజాసంఘాలు, గిరిజన సంఘాల నాయకులు గ్రామాల్లో పర్యటించి సమగ్ర నివేదికతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఫార్మాకు భూములను ఇచ్చేందుకు రైతులు ఆసక్తిగా లేరనే విషయం సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. ఫార్మా కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రైతులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు.

భూ అభిప్రాయ సేకరణ

ఫార్మా విలేజ్‌ల కోసం కారిడార్‌కు దుద్యాల మండలంలోని లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండా, హకీంపేట్, పోలెపల్లి గ్రామాల్లో 1314.21 ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూ సేకరణకు ప్రతిపాదించిన 1314.21 ఎకరాల్లో 637.36 ఎకరాలు అసైన్డ్ భూములు, 677.27 పట్టా భూములు ఉన్నాయి. లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలో 677.36 ఎకరాల భూ సేకరణ చేయాలని ప్రతిపాదించగా, వాటిలో 156.05 ఎకరాల అసైన్డ్ భూములు, 521.22 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. హకీంపేట్ పరిధిలో 506.13 ఎకరాలలో అసైన్డ్ 351.10 ఎకరాలు, పట్టా భూములు 155.03 ఎకరాలు, పోలేపల్లి పరిధిలో 130.21 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించాలని భావించగా, మొదటి నుంచి రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతూ వచ్చింది. చివరకు భూసేకరణను ప్రభుత్వం ఉప సంహరించుకున్నట్లు ప్రకటించడంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కాగా ఈనెల 11వ తేదీ నుంచి చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో దుద్యాల మండలంలో ఫార్మాకు బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఫార్మా విలేజ్‌లకు బదులుగా కాలుష్యం వెదజల్లని ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం అవసరమైన భూసేకరణకు తాండూరు సబ్‌కలెక్టర్‌ను భూసేకరణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు.

భూములు ఇచ్చేది లేదు



ప్రభుత్వం ఫార్మాను రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసినా మాలో సంతోషం లేదు. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు పెట్టే ప్రయత్నం చేసినా మేము మా భూములు ఇచ్చేది లేదు. మా భూముల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదు.

- రాంనాయక్, రోటిబండతండా

నోటిఫికేషన్ రద్దు చేసినా..



ఫార్మా భూ సేకరణ రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇంకా మాకు భయంగానే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి లగచర్ల ప్రాంతంలోని గిరిజనుల భూములను తీసుకోమని ప్రకటిస్తే సంతోషిస్తాం. మా భూములు మాకే ఉండాలి.

- అబిక, రోటిబండ తండా

అడవి దగ్ధంపై విచారణ జరపాలి



గీత

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దామగుండం అడవి దగ్ధంపై విచారణ జరపాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దామగుండం అడవిలో 2009 ఎకరాలు నేవీరాడర్ కేంద్రానికి అప్పగించిన నేపథ్యంలో అడవి దగ్ధమవడంపై విచారణ జరపాలని పేర్కొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఘట్‌కేసర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని టెక్నికల్ అడ్వైజరీ సర్వీసెస్, టెక్నాలజీ అండ్ బిజినెస్ గ్రూప్ చీఫ్ ఇన్నోవేషన్ గ్లోబల్ హెడ్ బాలప్రసాద్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సుపై (ఎస్ఎంఎన్‌సీ 2024) జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతి గ్రూప్‌ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, ఆసీస్‌బాబు, జనకి రాములు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేటితో ముగియనున్న సమగ్ర సర్వే

తాండూరు: సమగ్ర కుటుంబ సర్వేకు గడువు నేటితో(శనివారం) ముగియనుంది. ప్రభుత్వం ఈనెల 9వ తేదీ నుంచి కుల గణనను ప్రారంభించింది. ముందుగా ఈనెల 18న చివరి తేదీగా నిర్ణయించినప్పటికీ సాంకేతిక కారణాలతో ఆలస్యంగా ప్రారంభం కావడంతో అధికారుల విజ్ఞప్తి మేరకు గడువును ఈనెల 30వరకు పొడిగించిన విషయం తెలిసిందే.

తాండూరు రూరల్: సమగ్ర కులగణన కుటుంబ సర్వే వివరాలను జాగ్రత్తగా తప్పులు దొర్లకుండా కంప్యూటర్‌లో పొందుపర్చాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సర్వే వివరాల నమోదును శుక్రవారం ఆయన పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెద్దేముల్/తాండూరు రూరల్: జనగాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాములుయాదవ్ శుక్రవారం ఉదయం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. రాములుయాదవ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాండూరు మండలంలోని ఖుర్దు కొత్లాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల నవీన్‌రెడ్డి తల్లి అరుణమ్మ మృతిచెందగా చీఫ్‌విప్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ నియామకం

తాండూరు: తాండూరు భద్రేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా పటేల్ కిరణ్‌కుమార్ నియామకం కానున్నారు. పునరుద్ధరణ కమిటీ సభ్యులుగా 9మంది సభ్యులను గురువారం ప్రకటించిన విషయం విధితమే. 9మంది సభ్యుల నుంచి చైర్మన్‌గా పటేల్ కిరణ్ కుమార్‌కు అవకాశం దక్కనుంది. నేడు రేపో అధ్యక్షుల ప్రకటన కూడా వెల్లడించనున్నారు.

విద్యార్థుల స్వయంపరిపాలన

పరిగి: మున్సిపల్ పరిధిలోని గడమిది ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం,ఉపాధ్యాయులు అభినందించారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి

కీసర: డ్రగ్స్ రహిత సమాజస్థాపనకు కృషిచేయనున్నట్లు కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. మండలంలోని చీర్యాల్ గీతాంజలి కళాశాలలో శుక్రవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధకం, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

మూడుచింతలపల్లి: మొక్కలతోనే మానవ మనుగడ అని శామీర్‌పేట్ డీఐ గంగాధర్, ఎస్ఐ హారికలు అన్నారు. జగ్గంగూడ గ్రామ పరిధిలోని నిక్‌మార్ కాలేజీ వద్ద హైదరాబాద్‌లోని యునైటెడ్ వే అనే ఎన్‌జీవో, డెలాయిట్ కంపెనీ ఉద్యోగులు సంయుక్తంగా 10వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మొక్కలు నాటారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

పరిగి: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. పరిగి ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్‌లలో ట్రాఫిక్ నిబంధనలు శుక్రవారం అవగాహన కల్పించారు.

కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల భవనం పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కళాశాల విద్యార్థులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

బషీరాబాద్ ఎస్ఐగా శంకర్



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శంకర్

బషీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఎస్ఐగా పి.శంకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఎస్ఐ గఫార్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

బషీరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్, నవాంద్గీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల తీరును స్వయంగా పరిశీలించి అక్కడున్న రైతులతో ఎమైనా ఇబ్బందులు ఉన్నాయనేదానిపై ఆరా తీశారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు సోంపల్లి బిచ్చిరెడ్డి తదితరులున్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ తీగలు తగిలి చెరుకు పంట దగ్ధం



దగ్ధమైన చెరుకు పంట

బంట్వారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి చెరుకు పంట దగ్ధమైంది. ఈ ఘటన బంట్వారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తొర్మామిడికి చెందిన పంది లలిత అదే గ్రామంలో 2.26 గుంటల భూమిని కౌలుకు తీసుకుని చెరుకు పంటను సాగు చేసింది. అయితే శుక్రవారం ఉదయం సమయంలో పంట పొలంపై నుంచి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి చెరుకు పంటకు మంటలు వ్యాపించాయి. సుమారు ఎకర చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. దీంతో సదరు రైతుకు రూ.50వేల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఘటన చోటు చేసుకుందని, ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవడంతో తాము కష్టపడి పండించుకున్న పంట దగ్ధమైందని వాపోయింది. తమకు జరిగిన నష్టం పై అధికారులు చర్యలు తీసుకుని పంటను పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతు లలిత కోరింది.

భూవివాదం కేసులో ఇద్దరి బైండోవర్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఇద్దరిని ఘట్‌కేసర్ తహసీల్దారు బైండోవర్ చేశారు. మండలంలోని ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 258, 268లలోని 30గుంటల భూమిపై చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు విధులు నిర్వహిస్తున్న మహ్మద్ గనీ దాయాదులైన మహ్మద్ జబ్బార్, అతడి తండ్రి అఫ్జల్‌తో వివాదం నెలకొంది. దీంతో ఈ నెల 27న మహ్మద్ గనీ పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగడంలేదని, ఘట్‌కేసర్ సీఐ చాంబర్‌లో డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇదే కేసులో ప్రత్యర్థులైన మహ్మద్ జబ్బార్, అఫ్జల్‌లను పోలీసులు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకొని సాయంత్రం తహసీల్దార్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకూడదనే ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల వేలం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన రెండు కార్లు, ఒక బైక్‌కు వేలం వేయనున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 2వ తేదీన నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11గంటలకు జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో మూడు వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

దోమ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పరిగి నుంచి దోమ మండలానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓటిప్పర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం తరలిస్తూ లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

దోమ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యాన్ని తరలిస్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేకు మండలంలోని దిర్సంపల్లి కొనుగోలు కేంద్రం నుంచి వరి ధాన్యం బస్తాలతో అయినాపూర్ మీదుగా మోత్కుర్‌కు వెళ్తున్న క్రమంలో అనంతరెడ్డిపల్లి గేటు సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా గమనించిన స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారం




తాండూరులో జెండాఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి తాండూరు నుంచి తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణుల ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

పరిగి: దీక్షాదివస్ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పరిగిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ప్రభాకర్ రెడ్డి, సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: మేడ్చల్ జిల్లా స్థాయిలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవుటర్ రింగ్‌రోడ్డు వద్ద నుంచి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. మండల మాజీ జడ్పీటీసీ అనితాలాలయ్య, మధుకర్ రెడ్డి తదితరులు దీక్షా దివస్‌కు తరలివెళ్లారు.

రైతులకు సహకరించని అధికారులను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): రైతులకు సహకరించని అధికారులను సస్పెండ్ చేయాలని రైతుసేవ సహకార సంఘం తట్టేపల్లి చైర్మన్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. తట్టేపల్లి సహకార సంఘంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతును రాజుగా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తపిస్తున్నారని, సన్నాలకు రూ.500బోనస్ ఇస్తున్నారని తెలిపారు. తట్టేపల్లి, నాగులపల్లి గ్రామాల్లో సొసైటీ ద్వారా నిర్మించిన గోదాంలను లీజుకు ఇవ్వడానికి నిర్ణయించామని, ఆసక్తికలిగిన వారు లీజుకు తీసుకోవచ్చని తెలిపారు.

ఆపదలో తోటి ఉద్యోగులను ఆదుకోవాలి

శామీర్‌పేట , నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న తోటి ఉద్యోగులకు సాయం అందించి ఆదుకోవాలని హకీంపేట డిపో సీనియర్ ఏడీసీ గోపు శ్రీనివాస్, బాలరాజ్‌గౌడ్‌లు అన్నారు. గత నెల 24న హకీంపేట డిపోకు చెందిన కండక్టర్ ములుగు రవీందర్ ప్రమాదవశాత్తు మృతిచెందగా బాధిత కుటుంబానికి హకీంపేట డిపోకు చెందిన ఏడీసీలు కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది కలిసి రూ.87,500లను బాధిత కుటుంబానికి అందజేశారు.